నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM




భద్రాచలం వద్ద గణనాథులను లాంచీలో ఎక్కించి నిమజ్జనానికి తీసుకెళ్తున్న సిబ్బంది



జై జై గణేశా..

జై బోలో గణేశ్ మహరాజ్ కీ జై.. గణపతిబప్పా మోరియా.. అంటూ భక్తకోటి గణనాథుడికి భక్తిప్రపత్తులతో వీడ్కోలు పలికారు. ఉత్సవ మండపాలు, భారీ సెట్టింగులు, చలువ పందిళ్లలో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి వెళ్లి రావయ్యా.. మళ్లీ రావయ్యా అంటూ విఘ్నేశ్వరుడిని తల్లి గంగమ్మ ఒడికి చేర్చారు. భక్తబృందాల కేరింతలు, మేళ తాళాలు, డప్పు నృత్యాలు, పటాకుల మోతలు, విచిత్ర వేషధారణలు, పుష్పజల్లులు, కోలాటాలు, భజనలు, కీర్తనల మధ్య గణపతి నిమజ్జనోత్సవం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సోమవారం అట్టహాసంగా జరిగింది. సంప్రదాయ వస్త్రధారణలతో యువకులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ తమ ఇష్టదైవాన్ని నిమజ్జనం చేశారు. - ఖమ్మం, సెప్టెంబర్ 16





ఘనంగా వీడ్కోలు పలికిన భక్తకోటి



తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న విఘ్నేశ్వరుడు
నేత్రపర్వం.. గణేశుడి శోభాయాత్ర
సందడిగా మారిన గౌతమీ తీరం, మున్నేరు
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అట్టహాసంగా నిమజ్జనోత్సవం

# గంగమ్మ ఒడికి గణపయ్య



గాంధీచౌక్ విగ్రహానికి పూజలు చేస్తూ శోభాయాత్రను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల



భక్తుల కోలాహలం మధ్య గంగ ఒడికి వెళ్తున్న గణనాథులు



లంబోదరుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



ప్రత్యేక వస్త్రధారణతో ఊరేగింపు ముందు నడుస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణతో విగ్రహం ఎదుట కోలాటం వేస్తున్న మహిళా భక్తులు







ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఈ నెల 7న వినాయక చవితి రోజున వేలాది మండపాల్లో కొలువుదీరిన గణపయ్య తొమ్మిది రోజులపాటు భక్తుల విశేష పూజలందుకున్నాడు. సోమవారం గణనాథుల విగ్రహాలను భక్తకోటి సమీప జలాశయాల్లో ఘనంగా నిమజ్జనం చేశారు. గణనాథుడి విగ్రహాలను మున్నేరు, పాలేరు రిజర్వాయర్, ఆకేరు, చెరువులు, వాగులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

**నేత్రపర్వం.. శోభాయాత్ర**

సంప్రదాయ వస్త్రధారణలతో నృత్యాలు.. విచిత్ర వేషధారణలు.. డప్పు నృత్యాల కోలాహలంతో భక్తగణం గణనాథుడిని అనుసరించగా నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా సాగింది. రకరకాల ఆకృతులలో గల భారీ, చిన్న వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, వ్యాన్‌లు, లారీలు తదితర వాహనాలపై ఖమ్మం నగరంలోని పలురూట్ల నుంచి గాంధీచౌక్ ప్రత్యేక వేదిక వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి శోభాయాత్రగా మున్నేరు బ్రిడ్జి వరకు తీసుకెళ్లారు. గణేశ్ శోభాయాత్ర వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ ఎనలైజర్ ద్వారా డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు.

## శోభాయాత్రను ప్రారంభించిన తుమ్మల

ఖమ్మం గాంధీచౌక్ వద్ద గణేశ్ శోభాయాత్రను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వినాయకుడి నిమజ్జనం సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్, ఏడీసీపీ ప్రసాదరావు, ఆర్డీవో గణేశ్, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.





## మున్నేరులో నిమజ్జనం..

జిల్లా కేంద్రం ఖమ్మంలో సుమారు 800 విగ్రహాలను మున్నేరులో నిమజ్జనం చేశారు. కాల్వొడ్డు బ్రిడ్జి, ప్రకాశ్‌నగర్ వద్ద క్రేన్ల సాయంతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యలో ప్రజలు నిమజ్జనోత్సవాన్ని తిలకించారు.

## భద్రాచలం వద్ద..

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 16 : భద్రాచలం వద్ద గోదావరి నదిలో వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. భద్రాద్రి జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భద్రాచలం చేరుకున్న భక్తులతో గౌతమీతీరం సందడిగా మారింది. యువత కేరింతలు, మహిళల కోలాటాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గణనాథులను ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లు, లారీలపై నిమజ్జనానికి తీసుకురాగా గోదావరి తీరంలో అధికారులు ఏర్పాటు చేసిన సహాయక సిబ్బంది విగ్రహాలను క్రేన్ ద్వారా లాంచీలోకి ఎక్కించి నది మధ్యలో నిమజ్జనం చేశారు. గజ ఈతగాళ్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ టీంలను అధికారులు అందుబాటులో ఉంచారు. సోమవారం 530 విగ్రహాలు నిమజ్జనానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు.



త్రిచక్ర వాహనంపై ఏకదంతుణ్ని తీసుకెళ్తున్న దివ్యాంగుడు



పాల్వంచ: కోలాటాల నడుమ గణపయ్యను సాగనంపుతున్న భక్తులు



ఖమ్మం మున్నేరులో బుజ్జి గణేశుణ్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



భారీ గణేశ్ ఎదుట దరువులకు నృత్యాలు చేస్తున్న చిన్నారులు



ఖమ్మం: దేవతామూర్తుల వేషధారణలతో కళాకారులు



డప్పు దరువులు, కోలాటాలతో పార్వతీ పుత్రుడి ఊరేగింపు



గాంధీచౌక్ నుంచి మున్నేటికి కదులుతున్న విగ్రహాలు



ఖమ్మం: నృత్యాలతో గణపయ్యను తీసుకెళ్తున్న చిన్నారులు

# సాగులో సరికొత్త విధానాలు : కలెక్టర్ జితేశ్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ రంగాన్ని మరింతగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సరికొత్త విధానాలను తెస్తున్నదని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన రెండు రోజుల అగ్రికల్చర్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఎకరం, రెండు, మూడు ఎకరాలతోపాటు సెంటు భూమి ఉన్న రైతులు సైతం రూ.లక్ష వరకు ఆదాయం పొందడం ఎలా అనే అంశంపై ఎగ్జిబిషన్ ద్వారా అవగాహన



అగ్రికల్చర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కల్పిస్తున్నట్లు చెప్పారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, డీఆర్‌డీఏ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లు ఎంతో ఆకర్షణగా నిలిచాయని అన్నారు. హైదరాబాద్, ఢిల్లీ లాంటి మహానగరాల్లో ఇంతకుముందు స్టాళ్లను ఏర్పాటు చేసేవారని, జిల్లా రైతుల కోసం కొత్తగూడెంలో తొలిసారి అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కలెక్టర్ ప్రత్యేక చొరవతో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం కోసం జిల్లా రైతులకు కావాల్సిన అన్ని వనరులను చేకూరుస్తున్నారని అన్నారు. ఎస్పీ రోహిత్‌రాజు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఒరుపైనా, వర్షమైనా జెట్టీలే దిక్కు..

### జన్మనిచ్చేందుకు మరో జన్మనెత్తుతున్న ఆదివాసీలు

చర్ల, సెప్టెంబర్ 16: ఏజెన్సీ గూడేలకు ప్రాథమిక వైద్యం నేటికీ దూరంగానే ఉంటోంది. స్వాతంత్ర్య వజ్రోత్సవాలను వైభవంగా జరుపుకున్నా.. ఆదివాసీలకు ప్రాథమిక వైద్యం ఇంకా అందని ద్రాక్షనేగా మిగులుతోంది. ఈ చిత్రాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. నగరీకరణలు, నాగరిక సమాజాలు విస్తరిస్తున్న వేళ ఆదివాసీ అతివలు అమ్మతనాన్ని ఆస్వాదించేందుకు అనంత కష్టాలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా జన్మనిచ్చేందుకు వారు మరో జన్మనెత్తాల్సినంత దయనీయం. ఒరుపైనా, వర్షమైనా వారికి జెట్టీలే దిక్కవుతున్నాయి. పురిటినొప్పుల వేళ వారు ప్రాథమిక వైద్యం పొందాలన్నా





జెట్టీలపై ఆదివాసీ గర్భిణులు సుబ్బమ్మ, దేవి

కిలోమీటర్ల మేర నడవాల్సిన దుస్థితి. భుజాలు మార్చుకుంటూ యువకులు పరుగులు పెట్టాల్సి దయనీయ స్థితి.

**పురిటినొప్పులతో అడవి మార్గంలో..**

భద్రాద్రి జిల్లా ఏజెన్సీ మండలమైన చర్లలోని బట్టిగూడెం గ్రామానికి చెందిన రవ్వ సుబ్బమ్మ, రవ్వ దేవిలకు సోమవారం పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. అందుబాటులో వైద్యశాల లేదు. సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వారిని తరలించేందుకు ఆదివాసీ యువకులు అనేక పాట్లు పడ్డారు. ఇద్దరినీ వేర్వేరు జెట్టీలపై మోసుకుంటూ మూడు కిలోమీటర్ల మేర నడిచి వచ్చారు. అటవీ మార్గం ద్వారా ప్రయాణించి రోడ్డు పాయింట్ ఉన్న తిప్పాపురం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అంబులెన్స్ ద్వారా సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు.